క్లుప్తంగా

ట్రినిటి పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి సెకండరీ పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు వీలుగా అవగాహన కల్పించారు. మాజీ ఎమ్మెల్యే, ట్రినిటి విద్యాసంస్థల అధినేత ప్రజాస్వామ్య వ్యవస్థ, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉన్నారు.

మెహందీ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం మెహందీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, ప్రిన్సిపాల్ రాజుతో పాటు సరిత, అశ్విని, నిర్మల ఉన్నారు.

కోతుల బెడదను నివారించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అక్బర్‌నగర్, మొగల్‌పహాడ్, బ్రహ్మణపల్లి, ఐవోసీ ఇందిరమ్మకాలనీ, రాజీవ్ స్వగృహ కాలనీల్లో కోతుల బెడదను నివారించాలని శనివారం గ్రామస్తులు కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నూతనంగా వచ్చిన ఆయనను సన్మానించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండల రాజేందర్‌కుమార్, చాంద్‌పాషా, నాగుల చంద్రయ్య, కొమ్ము ఐలమ్మ, మహంకాళి కరుణ, సుంకరి రవీందర్, సలిగంటి రవికుమార్ ఉన్నారు.

బోనం ఎత్తిన విద్యార్థులు



వేషధారణలో విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి శనివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలను ఎత్తుకొని పోతురాజుల వేషధారణలతో నృత్యం చేస్తూ ఊరేగింపుగా వెళ్లి కాలనీ తెలంగాణ చౌరస్తా వాటర్ ట్యాంక్ వద్ద గల అమ్మవారికి బోనాలు సమర్పించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి, టీచర్లు సారయ్య, రమాదేవి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు

ఓదెల: ఎన్టీపీసీలో శనివారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల7న హైదరాబాద్‌లో సరూర్‌నగర్ స్టేడియం జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14లో జావెలిన్ త్రో పోటీల్లో కార్తీ అక్షయ్, కొలిపాక అక్షయ, 400మీటర్ల రన్నింగ్ పోటీల్లో ముద్దమల్ల అజయ్, అండర్16 జావెలిన్‌త్రోలో పెండం అభినయ, వేల్పుల అక్షయ గోల్డ్‌మెడల్స్ సాధించారు. విద్యార్థులను ఎంఈవో ఆరెపల్లి రాజన్న, హెచ్‌ఎం, పీఈటీ విష్ణు అభినందించారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

సుల్తానాబాద్: పట్టణంలోని పెరికెగిద్దె ఆంజనేయస్వామి ఆలయంలో నూతన ఆంజనేయ స్వామి అభిషేక విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. సుల్తానాబాద్ ప్రస్తుత కోఆప్షన్ సభ్యుడిగా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గొట్టం మల్లయ్య పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టును కరీంనగర్ మాజీ మేయర్ సివిల్ సప్లై రాష్ట్ర మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ శనివారం ప్రారంభించారు. ఆలయంలో శనివారం నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, రూ.35వేల విలువ చేసే పంచలోహ విగ్రహాన్ని ఆలయానికి వితరణ చేశారు. కరీంనగర్ మాజీ కార్పొరేటర్ సాదవేణి శ్రీనివాస్, సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ బాలాజీరావు, వికాస తరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ సాదుల షగుణాకర్, ట్రస్ట్ బాధ్యులు గొట్టం మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్ పాల్గొన్నారు.

స్నేహబంధం

- ఆదర్శంగా నిలుస్తున్న 1993–94బ్యాచ్ సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థులు
- ఆపదలో ఉన్న మిత్రులకు ఇప్పటివరకు రూ.10లక్షల వరకు సాయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆపదలో ఉన్న మిత్రునికి అండగా ఉండాలి. వాళ్ల కుటుంబానికి వెన్నుదన్నుగా నిలవాలన్నదే లక్ష్యం. మేమంతా ఒకటే మాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటాం, చేయూత అందిస్తాం అన్న భావనతో ముందుకు వెళ్తున్నారు 30ఏళ్ల క్రితం యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3సింగరేణి పాఠశాలలో 1993–94లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు. ఆపదలో ఆదుకునే వాడే నిజమైన స్నేహితుడు అనే మాటకు వీరు నిర్వచనంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగరీత్యా వీళ్లు వేరువేరు ప్రదేశాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీ తమ చిన్ననాటి మిత్రులలో ఎవరికి ఏ ఆపద వచ్చినా సాయం అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు.



స్నేహితునికి రూ.4.8లక్షలు అందిస్తున్న మిత్రులు (ఫైల్)

వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి..



స్నేహితుని కూతురు చదువుకోసం ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు (ఫైల్)

మిత్రులంతా వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి తమవంతుగా ఆపదలో ఉన్న మిత్రులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో ఎందరో అభాగ్యులకు సహాయం చేశారు. తమ స్నేహబృందంలో ఒకరైన యైటింక్లయిన్ కాలనీకి చెందిన పెండం వీరయ్య ట్రాన్స్‌కోలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. విద్యుత్ లైన్ మరమ్మతు కోసం కరెంట్ స్తంభం ఎక్కగా విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలు పాలైన వీరయ్య రెండు చేతులు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.4.80లక్షలు సేకరించి స్నేహితుడి కుటుంబానికి అందజేశారు. గోదావరిఖనికి చెందిన బాసాని లక్ష్మయ్య 2018లో అనారోగ్యంతో మృతి చెందగా రూ.1.35 లక్షలు అందజేశారు. మరొక మిత్రుడు కొంద్ర సురేశ్ 2022లో మృతి చెందగా కుటుంబ సభ్యులకు రూ.2.55 లక్షలు అందజేశారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు రూ.10లక్షలు అందించి చేయూతగా నిలిచిఆరు. భవిష్యత్‌లో మరింత మంది తోటి స్నేహితులతో కలిసి పేదరికంలో ఉన్నవారికి సాయం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వారు పేర్కొంటున్నారు.

సోషల్ సర్వీస్ చేద్దామనే..



95 మంది పూర్వ విద్యార్థులమంతా ఓ బ్యాచ్‌గా ఏర్పడి కలిసి సోషల్ సర్వీస్ చేద్దామని ముందుకు సాగుతున్నాం. అందులో భాగంగానే తోటి స్నేహితులతో పాటు అనేక మందిని కరోనా సమయంలో ఆదుకున్నాం. వారికి అన్నదానం, ఆర్థికసాయం అందించాం.

– మేరుగు రాజమౌళి, ప్రభుత్వ టీచర్, యైటింక్లయిన్‌కాలనీ

మిత్రులంటే ప్రాణం



చిన్నప్పటి నుంచి నాతోపాటు చదువుకున్న మిత్రులంటే నాకు ప్రాణం. వారిలో ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే సాయం అందించడానికి ముందు ఉంటాను. స్నేహితులం అందరం ఒకటే, మాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం ఉన్నా అనే ధైర్యం ఇవ్వడమే మా లక్ష్యం.

– ఎ.ఉపేందర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యూఎస్‌ఏ

నా వంతుగా సాయం



నా తోటి స్నేహితులు ఎవరైనా ఆపదలో ఉంటే నావంతుగా సాయం చేయాలనే ఆలోచనతో ఆపదలో ఉన్న మిత్రులకు సాయం చేస్తుంటాను. భవిష్యత్‌లో పేదలకు సైతం సాయం చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

– టి.శ్రీధర్, అడిషినల్ మేనేజర్, ఓసీపీ–3

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత ఉండేలా చూడాలి

మంథని: గ్రామాల్లో పరిశుభ్రత.. పచ్చదనం ఉండేలా చూడాలని మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమానాయక్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

ఎల్‌వోసీ అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మన్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌కు వెళ్లగా వెంటనే కాలేయ మార్పిడి చేయాలని సూచించారు. దాదాపు రూ.20లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మన్ తన పరిస్థితిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి దృష్టికి తసుకెళ్లాడు. వెంటనే ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు లక్ష్మన్ పరిస్థితి వివరించారు. స్పందించిన మంత్రి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రూ.3లక్షల చెక్కుకు సంబంధించిన పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ ఎల్‌వోసీని మంజూరు చేయించగా చికిత్స పొందుతున్న లక్ష్మన్‌కు సురేశ్‌రెడ్డి అందజేశారు. గుమ్మడి శ్రీనివాస్, తీగెల అశోక్‌గౌడ్ ఉన్నారు.



ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న సురేశ్‌రెడ్డి

జీజీహెచ్‌లో రక్తం నిల్వలు

కోల్‌సిటీ : గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని బ్లడ్ సెంటర్లో శనివారం వరకు ఏ–పాజిటివ్ 13, బీ–పాజిటివ్ 18, బీ–నెగిటివ్ 02, ఏబీ–పాజిటివ్ ఒకటి, ఓ–పాజిటివ్ 20, ఓ–నెగిటివ్ 03 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని బ్లడ్ సెంటర్ ల్యాబ్ ఇన్‌చార్జి సంపత్ తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు 90149 43487 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

డిగ్రీ ఫలితాల్లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం వెలువరించిన డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ చాటారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గాయత్రి, సుల్తానా, పల్లవి, శాలిని, కావ్య, సంతోషిణి, మేఘన, శృతిహాసిని, పూజ, సమీనాను అభినందించారు.

ట్రినిటి విద్యార్థుల హవా...

పెద్దపల్లి ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటారు. అక్షిత, అంజుం, స్వేశిక, మమత, నేహాఅంజుం, స్వాతిప్రియ, సంజన, రుచిత, శరణ్య, అక్షేయ, రసజ్ఞ, అక్షేయ, శ్రీవాణి, అఖిల, ఆసిఫా మంచి మార్కులు సాధించారు. ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ నీతారెడ్డి అభినందించారు.

ఎస్సీ కాలేజీ హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఎస్‌డబ్ల్యూవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్సీ కాలేజీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అశోక్ అన్నారు. త్వరగా హాస్టల్ భవనాన్ని అద్దె భవనంలోకి మార్చాలని కోరారు. నాయకులు సందీప్, శ్రావణ్, సురేశ్, నవీన్, సిద్దార్థ్, రాజు, రోహిత్, నితిన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తోందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల కాలపరిమితితో తమకు గుర్తింపు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం గతేడాది సాధించిన లాభాల్లో 35శాతం వాటా చెల్లించాలని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి మస్టర్ ఇవ్వాలని కోరారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఎస్.వెంకట్‌రెడ్డి, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, తిరుపతి, రాజేశ్, మనోజ్, సంపత్‌రావు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో శనివారం న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ సలహా మండలి సభ్యులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ హెల్త్ కార్డుల ద్వారా న్యాయవాదుల కుటుంబ సభ్యులకు రూ.2లక్షల వరకు వైద్య సదుపాయం, న్యాయవాదికి రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. అనంతరం రాజ్‌కుమార్‌ను సన్మానించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

రామగిరి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. మండలంలోని నాగెపల్లిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలకు సీమంతం నిర్వహించారు.

చీకురాయిలో తల్లిపాల వారోత్సవాలు

పెద్దపల్లిరూరల్: తల్లిపాలలో ఉన్న పోషక విలువపై బాలింతలు, గర్భిణులకు అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవతి అన్నారు. పెద్దపల్లి మండలం చీకురాయిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ చట్టాలపై సఖి కోఆర్డినేటర్ స్వప్న వివరించారు.

కమాన్‌పూర్ కార్యదర్శిగా తిరుపతి

కమాన్‌పూర్: కమాన్‌పూర్ పంచాయతీ కార్యదర్శిగా ముల్కూరి తిరుపతి విధుల్లో చేరారు. ఇంతకుముందు విధులు నిర్వహించిన మారుతి ధర్మారం మండలానికి బదిలీ అయ్యారు.

కుట్టుశిక్షణ కేంద్రాలు ప్రారంభం

పాలకుర్తి: మండలంలోని గుడిపల్లి, జయ్యారం గ్రామాల్లో మక్కాన్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రాలను సేవాసమితి చైర్మన్ మనాలీఠాకూర్ ప్రారంభించారు.

ఉచిత వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీలోని రామగుండం ఐవోసీఎల్ గ్యాస్ మెయిన్ స్టేషన్‌లో శనివారం సీజీడీ ఆధ్వర్యంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పృథ్వీ కార్మికులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

బదిలీ కార్యదర్శికి సన్మానం

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అంజలీధర్ ఇటీవల బదిలీ అయ్యారు. కాగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం మాజీ సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం సన్మానించారు. ప్రత్యేకాధికారి అత్తా రోద్దీన్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశం ఉన్నారు.

క్షీరాభిషేకం

జ్యోతినగర్: దేశప్రజల శ్రేయస్సే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాట ఫలితం సుప్రీంకోర్టు తీర్పు సందర్భంగా ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రధాని మోదీ, మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు మంద రవికుమార్, ఈదునూరి మల్లేశ్, సంజీవ్, అజయ్, బైరం కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ విగ్నేశ్వర నగర్‌లో నివాసముంటున్న కనికరం సుధాకర్ రెండు కిడ్నీలు పాడయ్యాయి. స్పందించిన 39వ డివిజన్ కార్పొరేటర్ జెట్టి జ్యోతిరమేశ్ శనివారం 25 కిలోల బియ్యం, రూ.3వేలు అందజేశారు.

రైల్వే సమాచారం (రామగుండం)

రామగుండం నుంచి బల్హార్షా, వరంగల్ వైపు వెళ్లే వారాంతపు రైళ్లు

బల్హార్షా వైపు..
12522 రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ ఉదయం గం.10.01లకు
12771 రాక్సల్ ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి గం.01.50లకు
వరంగల్ వైపు..
12708 సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి గం.03.39లకు
22151 పూణె ఎక్స్‌ప్రెస్ సాయంత్రం గం.5.12లకు
17008 దర్భాంగ ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి గం.2.55లకు



డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తాం

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. ఐదో డివిజన్ రాజ్యలక్ష్మి కాలనీలో శనివారం స్థానిక కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణితో కలిసి బురదమయమైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నిరోజులుగా కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయమయ్యాయని కాలనీవాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. బురదయమైన రోడ్లను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకొని సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఊరగొండ రమేశ్, దబ్బెట శంకర్, సభ్యులు శ్రీనివాస్ రాజయ్య, రాజ్‌కుమార్, షకూర్, గట్టు శ్రీనివాస్, చంద్రమౌళి, మాధవి, రమ, స్వప్న, రజిత పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గోదావరిఖని: సైబర్ నేరాలపై యువత, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీపీసీ ఏఎస్ఐ రాయిజ్ అన్నారు. స్థానిక పీకేరామయ్యకాలనీలో శనివారం యువతకు అవగాహన కల్పించారు. పరిసరప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు. కానిస్టేబుళ్లు అంజి, మల్లికార్జున్, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా వివరాలు చెప్పొద్దు

పాలకుర్తి: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతాల వివరాలు చెప్పొద్దని బసంత్‌నగర్ ఎస్సై స్వామి అన్నారు. పాలకుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని బక్కరాజంపల్లి గ్రామం వద్ద శనివారం మండల ప్రజలకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని, సైబర్ మోసాలకు గురైతే 1930కి సమాచారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న పోలీసులు

‘స్వచ్ఛదనం–పచ్చదనం’లో భాగస్వాములు కావాలి

కోల్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ‘స్వచ్ఛదనం–పచ్చదనం’ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ సెక్రెటరీ రాజు, సూపరింటెండెంట్ మనోహర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీవో భాస్కర్, పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతి, ఏపీఎం శైలజశాంతి, ఏపీవో లావణ్య పాల్గొన్నారు.

జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పద్మజ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం, హెల్త్ సూపర్‌వైజర్, కలీమొద్దీన్, జూలపల్లి ప్రత్యేకాధికారి నాగయ్య పాల్గొన్నారు.

రామగిరి: పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో ఎంపీడీవో శైలజారాణి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సుల్తానాబాద్: కార్యక్రమం విజయవంతం చేయాలని చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి కోరారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్‌తో పాటు డాక్టర్లు ఉదయ, శ్రీజ, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఎంపీవో సమ్మిరెడ్డి, డాక్టర్లు అనుదీప్, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.


కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ సమావేశ మందిరంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై ఎంపీడీవో రామ్మోహనాచారి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీవో గోవర్ధన్, ఐకేపీ ఏపీఎం కనుకయ్య పాల్గొన్నారు.

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో ఎంపీడీవో తిరుపతి శనివారం సమావేశమై సూచనలు చేశారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీవో షబ్బీర్, ఓదెల, కొలనూర్ వైద్యులు షాబొద్దీన్, శంజనేష్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రజిత, మండల పంచాయతీ అధికారి రమేశ్, మండల వైద్యాధికారి సుష్మిత, గౌతం, ఏపీవో రవీందర్, ఐకేపీ ఏపీఎం తులసీమాత పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ అవగాహన కల్పించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో జీవీ మహేశ్వర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, టీసెర్ప్ ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

అపోహలు వీడండి.. అవయవదానం చేయండి



డోనార్ కార్డులతో సింగరేణి ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ: అపోహలు వీడి నేత్ర, అవయవదానాలు చేయాలని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కోరారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా శనివారం ఆర్జీ–2ఏరియా ఎంవీటీసీ(గని శిక్షణ కేంద్రం)లో నూతనంగా చేరిన సింగరేణి యువ ఉద్యోగులకు నేత్ర, శరీర, అవయవదానాలపై అవగాహన కల్పించారు. 38మంది ఉద్యోగులు నేత్ర, అవయవ దానాలకు ముందుకు రాగా వారికి వీటీసీ మేనేజర్ రంగారెడ్డి డోనార్ కార్డులు అందజేశారు. ఎస్ఎంఎస్ ప్లాంట్ పీవో నూక రమేశ్, ఏటీవో మురళీకృష్ణ, సూపర్‌వైజర్లు మహేశ్, సతీశ్, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపికైన విద్యార్థికి అభినందన



స్వీటు తినిపిస్తున్న హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాలకు చెందిన పెంతల అభిజ్ఞ క్రీడా పాఠశాల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడా పాఠశాలలో ప్రవేశానికి అర్హత పొందింది. హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య శనివారం పాఠశాలలో అభినందించారు. ఉపాధ్యాయులు అమృత, సురేశ్, శ్రీవాణి, పాఠశాల చైర్మన్ స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు కొండేల మారుతి



సన్మానిస్తున్న చైర్‌పర్సన్ రమ

మంథని: ప్రతిఫలం ఆశించకుండా, లాభాపేక్ష లేకుండా కొన్నేళ్లుగా మంథని ప్రాంతంలో కొండేల మారుతి సమాజ సేవ చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ కొనియాడారు. మంథని ఫ్రెండ్స్ క్లబ్‌లో శనివారం స్వర్ణోత్సవ ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి దంపతులను సన్మానించారు. మాదాటి ప్రభాకర్‌రెడ్డి, తంగళ్లపల్లి మధూకర్, సువర్ణ సులోచన, కేఎల్ఎన్ హరిబాబు, రావికంటి శ్రీనివాస్, చంద్రుపట్ల సుధాకర్‌రెడ్డి, రామగుడు మారుతిరావు, బోగోజు శ్రీనివాస్, కొమురవెల్లి సత్యనారాయణ ఉన్నారు.